అంగన్వాడీ ఆయా పోస్టుల భర్తీకి ధరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-పాడేరు : అల్లూరి సీతారామరాజు జిల్లా పరిధిలో గల ఐసిడిఎస్ ప్రాజెక్టులు పాడేరు, రంపచోడవరం డివిజన నందు పియం జనమన్ స్కీంలో కొత్త గా మంజూరైన అంగన్వాడీ కేంద్రములలో ఆయాలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ బుధవరం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన మహిళ అభ్యర్థులు 2024 డిసెంబర్ 20 నుండి డిసెంబర్ 31వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోగా సంబంధిత శిశు అభివృద్ధి పథకం అధికారికి నేరుగా గాని పోస్ట్ ద్వారాగాని దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తు చేయదలచిన మహిళలు తప్పనిసరిగా పదోతరగతి ఉత్తీర్ణత పొంది ఉండాలని, ప్రధానంగా స్థానికంగా నివాసం కలిగి ఉండాలని వివాహిత స్త్రీ అయి ఉండాలని కలెక్టర్ తెలిపారు. 2024 జూలై 1 నాటికి అభ్యర్థులు 21 సంవత్సరములు పూర్తి చేసి 35 సంవత్సరాల లోపు వయసు కలిగి ఉండాలని తెలిపారు. 21 సంవత్సరాలలోపు అభ్యర్థులు లభించనిపక్షంలో 18 సంవత్సరాలు పూర్తయిన వారి దరఖాస్తులు పరిశీలించబడతాయని అయితే కేవలం ఎస్సి, ఎస్టి అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలకే వర్తిస్తుందని కలెక్టర్ స్పష్టం చేశారు. మార్కుల ఆధారంగా పూర్తి పారదర్శకతతో నియామకాలు జరుగుతాయని ఎటువంటి అవకతవకలకు ఆస్కారం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అభ్యర్థులు మధ్యవర్తులను, దళారులను నమ్మి మోసపోవద్దని, వారి అర్హతలను, మార్కులను పరిశీలించి ఎంపిక చేయటం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. పూర్తి వివరాల కొరకు సంబంధిత ఐసిడి ఎస్ నందు సంప్రదించాలని చెప్పారు.

గురుకుల విద్యార్థి ఆచూకీ కోసం తల్లిదండ్రులు ఆవేదన

విశాలాంధ్ర-కొయ్యూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న తమ కుమారుడు వంతల మనోజ్ తేజ్ ఈనెల 13 నుండి కనిపించడం లేదని పాఠశాల యాజమాన్యం తమకు 14వ తేదీన తెలిపారని పాత పాడేరు గ్రామంలో నివాసం ఉంటున్నతల్లిదండ్రులు సత్యనారాయణ రేణుక బుధవారం తెలిపారు. విషయం తెలిసిన వెంటనే బాబు ఆచూకీ కోసం గాలిస్తూనే ఉన్నామని తెలిపారు. అయితే ఈ విషయమై కొయ్యూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై కిషోర్ వర్మ వెంటనే స్పందించారని అన్నారు అలాగే గురుకుల పాఠశాల సిబ్బంది కూడా గాలిస్తున్నప్పటికీ నేటికీ ఆచూకీ తెలియక పోవడంతో భయభ్రాంతులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుమారుడు ఆచూకీ కోసం జిల్లా ఎస్పీ జిల్లా కలెక్టర్ కూడా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు అలాగే విద్యార్థి ఆశుకి ఎవరికైనా తెలిసినట్లయితే 94409042 ఫోన్ నెంబర్కు సమాచారం అంది ఇవ్వాలని వారు కోరారు.

అల్పపీడనం పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి

- రైతులు పంట కోతలు, నూర్పులు వాయిదా వేసుకోవాలి
- వైస్ ఎంపీపీ గోపినాయక శారద

విశాలాంధ్ర-చింతపల్లి : అల్ప పీడన ప్రభావం కారణంగా రాగల నాలుగైదు రోజుల్లో మన్యంలో కూడా మోస్తారు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాస్త్ర వేత్తల సూచనల మేరకు గిరి రైతులు వ్యవసాయ పంటల కోతలు, నూర్పిడి లను వాయిదా వేసుకోవాలని వైస్ ఎంపీపీ గోపినాయక శారద అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 19 నుంచి 22 వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్టంగా 1 మిల్లీమీటరు నుంచి గరిష్టంగా 8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందన్న శాస్త్ర వేత్తల సూచనల మేరకు రైతులు వరి పంట కోతలను, ధాన్యం నూర్పిడి లను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని సూచించారు. కోసిన వరి పంటను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించి జాగ్రత్త చేసుకోవాలన్నారు. అత్యవస పరిస్థితిలో కోతలు కొయ్యవలసి వస్తే కోసిన పంటను వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేర్చుకోవాలన్నారు. వర్షం కారణంగా తడిసిన వరి పనలపై లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయాలని సూచించారు. ఉప్పు ద్రావణంలో కంకులను ముంచి ఆరబెట్టాలన్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గిరి రైతులు కోత కోసి నూర్పి ఉంటే కల్లాలను టార్పోలిన్ పట్టాలతో కప్పి భద్రపరుచుకోవాలని, లేదా నూర్చిన ధాన్యాన్ని వెనువెంటనే ఇళ్లకు తరలించుకోవాలని రైతులకు ఆమె సూచించారు.

ఆధార్ కేంద్రాలను ఎంపీడీవో సందర్శన

విశాలాంధ్ర-కొయ్యూరు : ఆధార్ కార్డులో ఉన్న వివిధ సమస్యలపై ఆధార్ కేంద్రాలకు వచ్చే ప్రజల యొక్క సమస్యలు పరిష్కరించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మండల అభివృద్ధి అధికారి ఎస్ కె వి ప్రసాద్ తెలిపారు. బుధవారం మండల వ్యాప్తంగా మొదట విడతగా వివిధ అంగన్వాడీ కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ఆధార్ సెంటర్లను ఎంపీడీవో ఎస్ కే వి ప్రసాద్ సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ కార్డులో అనేకమంది పిల్లల పేర్లు నమోదు ,తొలగింపు వంటివి వాటి గురించి సుదూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని తెలియజేశారు. మొదటి విడత పూర్తి అయిన అనంతరం రెండో విడత ఈ నెల 26 నుండి ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో ప్రారంభం అవుతుందని ఆయా కేంద్రాల పరిధిలో ఉన్న ప్రజలు ఆధార్ సెంటర్ లను ఉపయోగించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.

సబ్ ప్లాన్ ఏరియాలోని గిరిజనులు అభివృద్ధికి చర్యలు

విశాలాంధ్ర-రంపచోడవరం : మైదాన ప్రాంతంలోని, సబ్ ప్లాన్ ఏరియాలో ఉన్న గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. బుధవారం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్తో, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో, వెలుగు ఎపిడితో, డిపిఎంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజనులు అభివృద్ధి చెందే విధంగా వందన్ వికాస కేంద్రాల ద్వారా అభివృద్ధి చేయుటకు ప్రాజెక్ట్ అధికారి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మైదాన ప్రాంతంలో గిరిజనులు, సబ్ ప్లాన్ ఏరియా లో ఉన్నటువంటి గిరిజనులను ఆర్థికంగా అభివృద్ధి చేసే విధంగా మైదాన ప్రాంతంలో ఉన్న అన్ని గిరిజనుల తెగలకు సంబంధించిన ఆధార్ కార్డులతో సహా జాబితా తయారుచేసి సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు ప్రస్తుతం ఏఏ పనులు చేసుకుంటున్నది ఆరా తీశారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులు వందన్ వికాస కేంద్రాల ద్వారా మినీ పరిశ్రమలు ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించడం జరుగుతుందని ఆయన అన్నారు. మైదాన ప్రాంతంలో ఉన్నటువంటి గిరిజనులకు ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన అన్నారు.

గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఉపాధ్యాయులకు మద్దతుగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థినిలు, తల్లితండ్రులు నిరసన

విశాలాంధ్ర-పాడేరు : గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం చేయాలని,బుధవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పాడేరులో విద్యార్థినిలు గురుకుల విద్యసంస్థలో ఆందోళన చేశారు. ఈ కార్యక్రమానికి విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శులు కె. రాజశేఖర్, జీవన్ కృష్ణ, అధ్యక్షులు కార్తీక్, కృష్ణరావు, విద్యార్థిని విద్యార్థుల తల్లితండ్రులు మాట్లాడుతూ గతనెల రోజులుగా గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు కోసం ఐటీడీఏ ముందు నిరాశన చేస్తునప్పటికి వారి సమస్యలను పరిష్కారం చేయకపోవడం చాలా విచారకరమన్నారు. గిరిజన గురుకుల ఔట్సోర్సింగ్ ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల విద్యార్థిని, విద్యార్థులలు విద్య అందక విద్యను దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థిని విద్యార్థులులకు గురువులు చదువు చెప్పకుండా ర్యాలీలు ధర్నాలు నిరాశనాలు చేసుకుంటూ కూర్చుంటే పబ్లిక్ పరీక్షలు ఎలా వ్రాసి విద్యార్థిని విద్యార్థులు ఉత్తీర్ణత సాధిస్తారాని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి దీక్ష చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు కాంట్రాక్టు ఉపాధ్యాయులగా నియమించి విద్యార్థిని విద్యార్థులకు న్యాయమైన చదువు కల్పించాలని కోరారు. 2022 పిఆర్సి ప్రకారంగా వారికి సమాన పనికి సమాన వేతనం అందించాలని డిమాండ్ చేశారు.గురుకుల విద్యసంస్థలలో ఇతర విద్య సంస్థల నుంచి డిప్యూటేషన్ క్రింద పంపించిన ఉపాధ్యాయులను వెంటనే వారికి వారి విద్యసంస్థలలో పంపించి, దీక్ష చేస్తున్న ఉపాధ్యాయుల నాణ్యమైన డిమాండ్స్ ను తక్షణమే పరిష్కరించి, ఆగిపోయిన పాఠ్యంశాలు కొనసాగించాలన్నారు. గిరిజన గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించేవరకు, విద్యార్థినీ, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవరకు ఆందోళన చేస్తామన్నారు.ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి జి. కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు చిన్నారావు, తల్లిదండ్రులు విద్యార్థినీ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాఫీ పళ్ళను దళారులకు విక్రయించొద్దు

- కాఫీ తోటలు పరిశీలించిన ఐటీడీఏ పీవో అభిషేక్
- కాఫీ పళ్ళకు కిలో రు.44లు చెల్లింపు
- చింతపల్లి మ్యాక్స్ సంస్థకు కాఫీ పళ్ళు విక్రయించాలని రైతులకు సూచన
- కాఫీ, మిరియాల సాగులో వస్తున్న ఆదాయంపై ఆరా

విశాలాంధ్ర-చింతపల్లి : కాఫీ పళ్ళను (ఫలాలను) దళాలకు విక్రయించి మోసపోవద్దని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ అన్నారు. గొందిపాకలు పంచాయతీ గాదిగొయ్యి గ్రామ రైతు కొండపల్లి వెంకటరావు కాఫీ తోటలను పిఓ అభిషేక్ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిగా పండిన కాఫీ పళ్ళు మాత్రమే సేకరించాలన్నారు. నాణ్యమైన పళ్ళు సేకరించడం వల్ల మంచి ధరలు వస్తాయని చెప్పారు. గత ఏడాది కాఫీ తోటల్లో ఎంత ఆదాయం వచ్చిందని రైతును అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మ్యాక్స్ సంస్థకు సరఫరా చేసిన కాఫీకి ఎంత ధర చెల్లించారని రైతును అడిగి తెలుసుకున్నారు. ముందుగా రూ.43లు, అనంతరం మూడు రూపాయలు బోనస్ చెల్లించారని రైతు వివరించారు. ఈ ఏడాది కాఫీ పళ్ళకు కిలో కు రూ.44లు మ్యాక్స్ సంస్థ చెల్లిస్తుందని మ్యాక్స్కు మాత్రమే కాఫీ పళ్ళను సరఫరా చేయాలని, దళారులు తూనికల్లో మోసాలు చేస్తారని, రైతులు అప్రమత్తంగా ఉండాలని రైతులకు ప్రాజెక్ట్ అధికారి సూచించారు. గత ఏడాది కాఫీ, మిరియాలు సాగులో వచ్చిన ఆదాయాన్ని అడిగి తెలుసుకున్నారు. మిరియాలు కిలో రూ. 500 నుండి రు.600 కి విక్రయించామని రైతు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి ఎస్ ప్రభాకర్ రావు, ఎం వెంకటేశ్వరరావు, ఏఈఓ అప్పలనాయుడు, కాఫీ ఫీల్డ్ కన్సల్టెంట్లు, లైజాన్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో సచివాలయం ఉద్యోగులు నిరసన

విశాలాంధ్ర-గంగవరం : ఈనెల 11న విశాఖపట్నంలో జివిఎంసి మీటింగ్లో జీవీఎంసీ కౌన్సిల్ మెంబెర్ అయిన కార్పొరేటర్ కాకి గోవిందా రెడ్డి గ్రామ వార్డ్ సచివాలయం ఎంప్లాయిస్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం మండలంలోని సచివాలయం ఉద్యోగులు గంగవరం మండల పరిషత్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కాకి గోవిందా రెడ్డి భేషరతుగా క్షమాపణ చెప్పాలని అనుచిత వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అల్లూరి జిల్లా గ్రామ సచివాలయం ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ పిలుపుమేరకు గంగవరం మండల గ్రామ సచివాలయం ఉద్యోగుల అధ్యక్షుడు చవలం బాలు దొర, వైస్ ప్రెసిడెంట్ మడకం దొరబాబు, జనరల్ సెక్రటరీ కారం శివ గణేష్ ఆధ్వర్యంలో గంగవరం మండల సచివాలయం ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన పలువురు సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పార్వతీపురం మన్యం

జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు

విశాలాంధ్ర-పార్వతీపురం : జిల్లాలో కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. పాచిపెంట మండలం శతాబివద్ద కాఫీ క్లస్టర్ ఏర్పాటుకు అవకాశాలు ఉన్నాయని ఆయన చెప్పారు. ప్రాథమిక రంగాల శాఖల ప్రగతిపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పొలం గట్లపై ఆదాయం సమకూరే అంతర పంటలు వేయాలని, వాటిపై రైతులకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు. కూరగాయల విత్తనాలను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచాలని, స్వయం సహాయక సంఘాల సభ్యులు ద్వారా చేపట్టాలని ఆయన ఆదేశించారు. జనవరి నుండి రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆయన అన్నారు. డ్రోన్ వినియోగంలో ముందంజలో ఉండాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. మహిళలు డ్రోన్ పైలట్ లుగా రావాలని, ప్రతి మండలంలో డ్రోన్ దిది లను గుర్తించాలని ఆయన పేర్కొన్నారు. ఉద్యానవన పంటలులో 15 శాతం వృద్ధి ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ వంటి క్లస్టర్ లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. నిమ్మగడ్డి పెంపకం వలన రైతులకు ఆదాయం వస్తుందని ఆయన వివరించారు. రైతులకు ఆయా క్షేత్రాలను చూపించాలని, ప్రతి నెల నిమ్మగడ్డి పెంపకందారుల సంఖ్య పెంచాలని ఆయన అన్నారు. పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు (పి.కె.సి.సి) రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో కేజ్ కల్చర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. మత్స్య ఉత్పాదక సంస్థ (ఎఫ్ పి ఓ) ద్వారా మత్స్య ఆహార యూనిట్లు ఏర్పాటుకు యోచించాలని ఆయన అన్నారు. నగర వనం, నగర వాటిక అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా అటవీ అధికారిని ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా అటవీ అధికారి జి.ఏ.పి. ప్రసూన, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా పశుసంవర్థక అధికారి ఎస్ మన్మథ రావు, పి హెచ్ ఓ మణి భూషణ్, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా సహకార అధికారి పి శ్రీరామ మూర్తి, జిల్లా మత్స్య శాఖ అధికారి వి. తిరుపతయ్య, జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వి రాధాక్రిష్ణ, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు, ప్రకృతి వ్యవసాయం డిపిఎం షణ్ముఖ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-బెలగాం : పెట్రోల్ పోసుకొని వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పార్వతీపురం జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పార్వతీపురం మండలం బాలగుడబ గ్రామానికి చెందిన అమిటి సతీష్ కు పెళ్లయి 14సం.లు అయింది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. మద్యానికి అలవాటు పడ్డాడు. ఈ విషయంలో ఎప్పటికప్పుడు భార్యాభర్తల మధ్య గొడవలు జరిగేవి. దీనితో అతని భార్య 5సం.ల నుండి పిల్లలతో తన కన్నవారి ఇంటికి (ఆరిలోవ) వెళ్లి ఉంటోంది. సతీష్ ఎన్నిసార్లు కబురు పంపినా, పెద్దలచే పిలిపించినా నోటీసులు ఇచ్చినా ఆమె రావడానికి నిరాకరించడంతో మనస్తాపం చెంది మంగళవారం రాత్రి ఒంటి గంట ప్రాంతంలో ఇంటి మేడపైకి వెళ్లి పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు వెంటనే పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందిస్తున్నారు. సుమారు 80శాతం వరకు ఒళ్ళంతా కాలిపోయింది. పార్వతీపురం కోర్టు మేజిస్ట్రేట్ సమక్షంలో వాంగ్మూలం తీసుకున్నారు. వివరాలు నమోదు చేసినట్లు ఔట్ పోస్టు ఎఎస్ఐ నిమ్మకాయల భాస్కరరావు తెలిపారు.

పిఎంఏవై 2.0 క్రింద ఇళ్ళమంజూరుకు దరఖాస్తులు ఆహ్వానం

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పిఎంఏవై) పథకం క్రింద అర్హతగలవారు దరఖాస్తులు సమర్పించవచ్చని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గృహ నిర్మాణాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్హత కలిగి గతంలో ఇళ్ళు మంజూరు కానివారికి ఇళ్ళు మంజూరు చేయడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్హతగల వారు గ్రామ సచివాలయం వద్ద ధ్రువీకరణ పత్రాలతో దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. ఈపథకంలో నమోదు చేసుకోవడానికిభార్య, భర్తల సంతకము చేసిన ఆధార్ కార్డులు నకలు, రేషన్ కార్డ్ జిరాక్స్ కాపీలు,బ్యాంక్ అకౌంట్ పాస్ బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీ, స్థలము అనుబంధ పత్రం లేదా స్థలము రిజిస్టర్ డాక్యుమెంట్, ఈసి, ఆదాయ ధ్రువపత్రం, కులధృవీకరణ పత్రం, ప్రస్తుత ఇంటి స్థలం కెమెరా ఫోటో, తదితర డాక్యుమెంట్స్ అన్నిటిని జతచేయాలని వివరించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, గృహ నిర్మాణ సంస్థ ఇన్ ఛార్జ్ కార్యనిర్వహక ఇంజినీర్ వంశీ, డిఇ సోమేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణీల వసతి గృహాన్ని కురుపాం ఎమ్మెల్యే తనిఖీ

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో ఉన్న గర్భిణీల వసతి గృహాన్ని ప్రభుత్వ విప్ &కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి సందర్శించారు.ఆమె గర్భిణీలతో మాట్లాడి వారికి అందుతున్న వసతులపై అడిగి తెలుసుకున్నారు. డార్మెంటరీ, వంటగది పరిసరాలను పరిశీలించారు. గర్భిణీలకు పెట్టే పౌష్టికాహారం మెనూ ప్రకారం అందించాలని, అలాగే వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట వైటిసి మేనేజర్, గర్భిణీల వసతి గృహా సిబ్బంది ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.75లక్షల చెక్కును జిల్లా ఎస్పీ అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం : సుదీర్ఘకాలం బాటు పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ గతఏడాది డిసెంబర్ నెలలో రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పాలకొండ పోలీస్‌స్టేషన్ పోలిస్ కానిస్టేబుల్ కె.సత్యన్నారాయణ కుటుంబానికి పోలీస్ శాలరీ ప్యాకేజి ఆక్సిడెంటల్ డెత్ బెనిఫిట్స్ ,స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా) ద్వారా మంజూరు చేసిన 75లక్షల అక్షరాల డబ్బై ఐదు లక్షల రూపాయులు) చెక్కును అతని సతీమణి అయిన లలితకు జిల్లా ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి బుధవారం నాడు అందజేసారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో అందజేసిన ఎస్పి శాఖా పరంగా ఇంకా రావలసి ఉన్న ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు.ఈకార్యక్రమం లో ఎస్పీతో పాటుగా ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్బీ సిఐ రంగనాధం, ఆర్ఐలు నాయుడు, శ్రీరాములు, పి.సూపరింటెండెంట్ సూర్యకుమారి,పి అరుణ, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియా ,పార్వతీపురం ఫీల్డ్ ఆఫీసర్ కె.గౌరిశంకర్ రాజేష్‌లు పాల్గొన్నారు .

రోడ్డు సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : బుధవారం నాడు గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం మండలం, తాడికొండ పంచాయతీ పరిధిలో కప్పకల్లు గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ఆ గ్రామ ప్రజలు ప్రభుత్వ విప్ & కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కి వినతి పత్రం అందించారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేక అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం లేదని రాకపోకలకు ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కప్పకల్లు గ్రామానికి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తానని, రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు.

గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలి

వ్యవసాయాధికారి తిరుపతిరావు

విశాలాంధ్ర-పాచిపెంట: రెండు రోజులపాటు వర్షం పడే అవకాశాలు ఉన్నందున రైతుల అప్రమత్తంగా ఉండాలని వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారి కే తిరుపతిరావు అన్నారు. చెరుకుపల్లి అమ్మ వలస గ్రామాలలో వరి నూర్పులను పరిశీలించి రైతులకు రెండు రోజులు పాటు కురిసే వర్షాలకు తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు జారీ చేశారు .వరి కోతలు వాయిదా వేసుకోవాలని కోతలు కోసినవి కుప్పలు వేసి కప్పుకోవాలని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులు తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని రానున్న వర్షాలపై రైతులకు తెలియజేయాలని సూచించారు. వరి కోసిన ధాన్యం రోడ్లపై ఉండకూడదని అత్యవసర పరిస్థితులలో జాయింట్ కలెక్టర్ ద్వారా వచ్చిన 20 టార్పలిన్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఎక్కడైనా ధాన్యం నిలవలు ఉన్నట్లయితే వెంటనే ట్రక్ షీట్లు చేసి మిల్లులకు పంపించాలని సూచించారు. మొక్కజొన్న పంటకు నీరు పోయేందుకు సదుపాయం కల్పించాలని రైతులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మోహన్ కృష్ణ పాల్గొన్నారు.

విపత్తుల వలన వచ్చే ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎన్డీఆర్ఎఫ్ టీం కమాండెంట్ ప్రభిన్ పుఖాన్

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : అకస్మాత్తుగా విపత్తులు సంభవించేటప్పుడు దానివలన జరిగే ప్రమాదాలపై పూర్తి అప్రమత్తంగా ఉండాలని జాతీయ విపత్తుల ప్రతిస్పందన దళం టీం కమాండర్ ప్రభిన్ పుఖాన్ అన్నారు. బుధవారం చినమేరంగి గ్రామ సమీపంలో ఉన్న స్వామినాయుడు చెరువు పేరుతో ఉన్న కోనేరులో ఆయన ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ప్రజలకు పూర్తి అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కమాండర్ మాట్లాడుతూ ఎన్డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్నకుమార్ ఆదేశాల మేరకు కోస్తా తీర మండలాలలో గల గ్రామాలు పాఠశాలలు మరియు పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కమ్యూనిటీ అవేర్నెస్ కార్యక్రమాల ద్వారా ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు విపత్తుల నివారణ మరియు నిర్వహణపై చేయకూడనివి ఉరుములు మెరుపులు కుంభవృష్టి వడగండ్ల వాన బలమైన గాలులు వీచినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై పూర్తి అవగాహన కల్పిస్తున్నామని ఆయన అన్నారు. బుధవారం 10వ బెటాలియన్ కమాండెంట్ వివిఎన్ ప్రసన్నకుమార్ జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ ఆదేశాల మేరకు చినమేరంగి గ్రామ స్వామినాయుడు కోనేరులో మాక్ ఎక్సర్సైజ్ పై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ టీం హెచ్సీ ఎం. రామారావు, ఫైర్ స్టేషన్ ఎస్ఐ బి. ప్రసాదరావు మండల స్థాయి అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బందికి శిక్షణలు నిర్వహించాలి : ఐటిడిఎ పీవో

విశాలాంధ్ర -సీతంపేట: మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో పీసా ఎన్నికల సంధర్భంగా ఎన్నికల సిబ్బందికి శిక్షణలు నిర్వహించాలని ఐటిడిఎ పీవో సి.యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం సంబంధిత ఎన్నికల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈనెల 20 నుండి 31వ తేదీలోపు సీతంపేట మండలంలోని 41 పంచాయతీల్లో 102 గ్రామ సభలు నిర్వహించి వైస్ ప్రెసిడెంట్ మరియు సెక్రటరీ (ఉపాధ్యక్షులను మరియు కార్యదర్శిని) ఎన్నుకోవడం జరుగుతుందని తెలిపారు. పీసా ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేలా అధికారులు, పోలీస్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో, ఎంపిడివో, తహశీల్దార్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రహరీ మంజూరు చేయండి

విశాలాంధ్ర-కురుపాం : మండలంలోని ధర్మలక్ష్మీ పురం గిరిజన సంక్షేమ ,మండల పరిషత్ పాఠశాలలు కు ప్రహరీ గోడ మంజూరు చేయాలని ధర్మలక్ష్మీపురు గ్రామ పెద్దలు కురుపాం ఎమ్మెల్యే ,రాష్ట్ర విప్ తోయక జగదీశ్వరిని ఆమె నివాసంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్కూలు ప్రహరీగోడ లేక పోవడం వలన పిల్లలకి బద్రత లేదని, విషసర్పాలు ఎక్కువుగా తిరిగే స్థలం గనుక ఎలాంటి ప్రమాదం జరుగకుండా ముందుగా ప్రహరీగోడ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు.

రెవెన్యూ సదస్సులు నేపథ్యంలో ఆడాకుల గ్రామసభ రద్దు : తహసిల్దార్ ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : రాష్ట్ర కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నందున ఈ నెల 19న ఆడాకులలో జరప తలపెట్టిన గ్రామసభను రద్దు చేయడం జరిగిందని తహసిల్దార్ ఎస్ఎల్వి ప్రసాద్ తెలిపారు. బుధవారం స్థానిక విలేకరులకు విడుదల చేసిన ప్రకటనలో తహసిల్దార్ ఎస్ఎల్వి ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో గ్రామ రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తున్న నేపథ్యంలోనే ఆడాకుల గ్రామసభను రద్దు చేయడం జరిగిందని తెలిపారు. తిరిగి ఆడాకులలో గ్రామసభ ఎప్పుడు నిర్వహించడం జరుగుతుంది అనేది త్వరలో తేదీని వెల్లడి చేస్తామని తాసిల్దార్ ఎస్ ఎల్ వి ప్రసాద్ తెలిపారు.

సీజనొచ్చేసిందోచ్

- మన్యంలో మారుజాతి కలప మాయం!
- అక్రమార్కులతో అధికారులు కుమ్మక్కు!
- చేతులు మారుతున్న లక్షలాది రూపాయలు..

విశాలాంధ్ర-దేవీపట్నం : శీతాకాలం వచ్చిందంటే కలప వ్యాపారులకు సీజన్ వచ్చినట్టే. కంచే చేను మేస్తే అన్న చందంగా మారింది అటవీ శాఖలో అధికారులు తీరు. ఆమ్యామ్యాలకు అలవాటు పడ్డ అటవీ శాఖ అధికారులు సిబ్బంది అక్రమార్కులైన కలప వ్యాపారులతో చేతులు అటవీ సంపదను హద్దులు దాటించేస్తున్నారు. నిత్యం మామిడి, జీడిమామిడి మాటున విలువైన మారుజాతి కలపను ఏజన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు తరలిపోతుంది. సీజనల్‌గా సీతాకాలంలో జరిగే అక్రమ రవాణాలో సుమారు కోటి రూపాయలు వ్యాపారులు -అధికారుల మధ్య చేతులు మారతాయని బాగోట్టా. దేవీపట్నం మండలంలోని ముంపు ప్రాంతాలైన దండంగి చిన రమణయ్య పేట డి. రావిలంక, పోశమ్మ గండిలతో పాటు గంగం పాలెం, చిన్నారిగండి పోతవరం లోతుపాలెం కొత్తవీధి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు మారుజాతి కలప ను యదేచ్ఛగా తరలించేస్తున్నారు. గత నెలలో ముంపు ప్రాంతమైన చిన రమణయ్య పేట గ్రామ శివారున ఉన్న సుమారు 67టేకు చెట్లు ఇందుకూరు పేట కు చెందిన ఓ వడ్రంగి కలపను హద్దులు దాటించటానికి సుమారు 8లక్షలు రూపాయలు అటవీ శాఖ అధికారులకు ముడుపులుగా చెల్లించారంటే అధికారుల్లో అవినీతి ఏ స్థాయిలో ఉందో ఇట్టే చెప్పొచ్చు. మరికొందరు వ్యాపారులు శీతాకాలంలో జరిగే బ్యారన్ కోసం కలపను కోరుకొండ శీతానగరం, రఘుదేవపురం ముగ్గళ్ల వంటి ప్రాంతాలకు వ్యాన్ లల్లో కలపను తరలించేస్తున్నారు.

అక్రమార్కులకు అడ్డుకట్ట వేసేదెవ్వరు..? ఏటా సీజన్ సమయంలో అడ్డు అదుపు లేకుండా మారుజాతి కలపను తరలించేసే వ్యాపారులకు అడ్డుకట్ట వేసే నాథుడే లేక పోయాడంటే అతిశయోక్తి లేదు. అక్రమార్కులైన అటవీ శాఖ అధికారులు సిబ్బంది మారుజాతినే కాదు ఏ జాతి కలపనైనా ఇట్టే హద్దులు దాటించేస్తారు. వివిధ సెక్షన్ లలో బీట్ ఆఫీసర్ల కోసం ఏర్పాటు చేసిన బీట్ ఆఫీసర్ల క్వాటర్లలో నివాసం ఉండక పోవటం ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటం అక్రమార్కులకు కలిసొచ్చిన అంశంగా మారింది. దీనికి అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

సఫాయి కర్మచారిలకు పునరావాసం కల్పించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : సఫాయి కర్మచారి (పారిశుధ్య కార్మికులు)లకు పునరావాసం కల్పించాలని జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డాక్టరు పి.పి. వావా అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బుధవారం జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు వావా సమావేశంను నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సఫాయి కర్మచారిలకు విధిగా పునరావాసం కల్పించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ పథకాలను వారికి అమలుచేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆయన ఆదేశించారు. బ్యాంకు రుణాలకు ష్యూరిటీలు అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశువులు, కోళ్ళు తదితర పెంపకం యూనిట్ల మంజూరు చేయవచ్చని, సేవా రంగం లోనూ అనేక అవకాశాలను కల్పించవచ్చని ఆయన చెప్పారు. జాతీయ సఫాయి కర్మచారి ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సఫారీ కర్మచారి కుటుంబ సభ్యులకు వివిధ రంగాల్లో శిక్షణ కార్యక్రమాలను కూడా నిర్వహించడం జరుగుతుందని ఆయన చెప్పారు. సఫారీ కర్మచారి విధివశాత్తు మరణించినప్పుడు తక్షణం కుటుంబ సభ్యులకు ఉద్యోగాన్ని కల్పించాలని ఆయన అన్నారు. ఎట్టి జాప్యం ఉండరాదని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు అవసరమగు దుస్తులు, బూట్లు, చేతి గ్లోవ్స్, నూనె తదితర సామాగ్రిని విధిగా అందజేయాలని ఆయన అన్నారు హెపటైటిస్ - బి వాక్సిన్ వేయించాలని, నిర్దేశిత సమయంలో వైద్య శిబిరాలను నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు అందవలసిన ప్రతి ప్రయోజనాన్ని విధిగా అందించాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ఆయన అన్నారు. పారిశుధ్య కార్మి కుల ఆదాయాలకు అతీతం గా ప్రభుత్వం ఇళ్ళు మంజూరు చేయాలని ఆయన చెప్పారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులతో ముఖాముఖిగా మాట్లాడి వారికి అందుతున్న ప్రయోజనాలు, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంతకముందు జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ సభ్యులు డా.పి.పి. వావాను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛాన్ని అందించారు. జిల్లాలోపరిస్థితిని వివరించారు. ఈసమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక, అదనపు ఎస్పీ డా. ఓ.దిలీప్ కిరణ్, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారిత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, జిల్లా కార్మిక శాఖ అధికారి కె. రామకృష్ణరావు, డివిజనల్ అభివృద్ధి అధికారి రమేష్ రామన్, మున్సిపల్ కమిషనర్లు శ్రీనివాస రాజు, ఎస్ సర్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై అవగాహన ఉండాలి : ఎంపీపీ శెట్టి శ్యామల

విశాలాంధ్ర-కొమరాడ : ప్రతి ఒక్కరు స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై అవగాహన తప్పకుండా కలిగి ఉండాలని ఎంపీపీ శ్యామల అన్నారు. ప్రభుత్వ ఆదేశాలమేరకు రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ ద్వారా లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్స్(ఎల్ఎస్డిజి) మీద ఆయన ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వెలుగు కార్యాలయం కొమరాడ గ్రామ సచివాలయంలో ముందుగా మహాత్మాగాంధీ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు జ్యోతి వెలిగించి సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బంది తోమొదటి రోజు శిక్షణ తరగతులు ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ శెట్టి శ్యామల గౌరవ జడ్పిటిసి సభ్యురాలు ద్వారపురెడ్డి లక్ష్మి శిక్షణ తరగతు ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి కార్యక్రమంలో చురుకుగా పనిచేస్తూ మీ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించుకోవాలన్నారు స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇందులో భాగంగా వివిధ పరిశ్రమలు, హౌస్ హెూల్డ్స్, భూముల సర్వే, యానిమల్ హస్బండ్రీ వంటి ప్రతి విషయాన్ని అనునిత్యం అప్డేట్ చేయాలన్నారు. గ్రామాల వారిగా జరగాల్సిన వివిధ సర్వేల వెనుకబాటుతనం పైనా ఆరా తీశారు. దీనికి సంబంధించిన శిక్షణలో భాగంగా నియమాలు, నిబంధనలు పంచాయతీ రాజ్ , చట్టాల రూపకల్పన, నిర్వహణ తదితర అంశాలపై స్క్రీన్ ద్వారా క్షుణ్ణంగా వివరించారు. మీ గ్రామ పరిధిలోని పరిశ్రమల స్థితిగతులను సమగ్ర సర్వే చేస్తూ ఆన్లైన్లో వివరాలు నమోదు చేయాలన్నారు. ఈ పరిశ్రమల ప్రాంతంలో నిరుద్యోగ యువతకు శిక్షణ ద్వారా ఉపాధి కల్పన, పరిశ్రమలు అభివృద్ధి చెందితే పంచాయతీలకు ఆదాయ వనరుగా కూడా సమకూరుతుందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి కావాలంటే అన్ని రంగాల్లోనూ ముందుండాలని అన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మంచినీటి డ్రైనేజీ పారిశుద్ధ పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు సర్పంచ్లకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఎం.మల్లికార్జున రావు, ఏపీఎం సురేష్ బాబు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రాజేంద్ర పి ఆర్‌జెఈ ఫణీస్‌బాబు వ్యవసాయశాఖ అధికారి పి.శంకర్రావు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం నిర్మాణానికి కొత్తగా టెండర్ల పిలుపు

- గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా మ్యూజియం నిర్మాణం
- ఇంజనీరింగ్ అధికారులకు సూచించిన గిరిజన సంక్షేమ శాఖ సంచాలకురాలు సదా భార్గవి

విశాలాంధ్ర-చింతపల్లి :గిరిజన సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణం జరగాలని గిరిజన సంక్షేమ శాఖ సంచాలకురాలు సదా భార్గవి అన్నారు. ఆంధ్ర కాశ్మీర్‌గా పేరొందిన లంబసింగి, తాజంగి గ్రామాల మధ్య నిర్మితమవుతున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం నిర్మాణ పనులను పాడేరు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి అభిషేక్ తో కలసి బుధవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మ్యూజియం నిర్మాణ పనులలో జాప్యం జరుగుతుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వాతంత్ర సమరయోధుల మ్యూజియం నిర్మాణం పనులకు కొత్తగా టెండర్లు పిలవాలని ఆదేశించారు. కొత్త టెండర్లు పిలిచి పాత కాంట్రాక్టర్‌ను తొలగించి కొత్త నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వచ్చే జనవరి 8వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. 16వ తేదీ నుండి పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. మ్యూజియం నిర్మాణం పనులు మూడు విభాగాలుగా విభజించి మూడు నిర్మాణ సంస్థలకు పనులు అప్పగించాలనీ, పనులన్నీ ఏకకాలంలో పూర్తి కావాలని పేర్కొన్నారు. వచ్చే మార్చి నెలాఖరు నాటికి పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. మ్యూజియం అంతర్భాగంలో విద్యుత్ కాంతులు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, ఉద్యానవనం పనులకు ఆయా రంగాలలో అనుభవం ఉన్న సంస్థలకు పనులు అప్పగించి సుందరీకరణ చేయాలన్నారు. మ్యూజియం నిర్మాణం మన్య ప్రాంతానికే మణిహారంగా ఉండాలన్నారు. మ్యూజియం నిర్మాణం పనులను ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి పనులు వేగంగా పూర్తి చేయించాలని సూచించారు. ఈసందర్భంగా ఇంజనీరింగ్ అధికారులు మ్యూజియం నిర్మాణంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆమెకు వివరించారు. దీనిపై అధికారులకు ఆమె సూచనలు చేసి సలహాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్‌రావు, ఎం.వెంకటేశ్వరరావు, టిఆర్ఎం ఈడి మందారాణి, ఈఎన్‌సి శ్రీనివాస్, ఈఈజి. డేవిడ్, గిరిజన సంక్షేమ శాఖ డిఈ రఘు, ఏఈ యాద కిషోర్, ట్రైకార్ అసిస్టెంట్ సీతారాం, ఇంజనీరింగ్ అధికారులు సిబ్బంది, స్థానిక వీఆర్వో మానవతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ నిర్వహణ : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రతీరోజూ గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. నియోజక వర్గ టిడిపి కార్యలయంలో ప్రజా దర్బార్‌కు మంచి స్పందన వస్తోందన్నారు.వివిధప్రాంతాలకు చెందిన మహిళలు, నిరుద్యోగ, యువత, పెద్దలు అధిక సంఖ్యలో హాజరై వారి వినతులు అందజేస్తున్నారు. ప్రతి ఒక్కరి సమస్య క్షుణ్ణంగా విని సంబంధిత అధికారులు దృష్టికి సమస్యను తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయ్‌చంద్ర తెలిపారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కేంద్రమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు : కేంద్ర పౌరవిమానయాన శాఖమంత్రి, చిన్న వయస్సులో మంత్రిగా పేరుగాంచిన మహోన్నతమైన వ్యక్తి కింజరాపు రామ్మోహన్‌నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసినట్లు ఎమ్మెల్యే విజయ్‌చంద్ర తెలిపారు. బహుభాషా కోవిదుడుగా కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఉత్తరాంధ్ర జిల్లాల ఖ్యాతిని పార్లమెంటు వేదికగా ప్రపంచానికి తెలియజేస్తున్నారని కొనియాడారు.

రేవళ్ళ గ్రామంలో సజావుగా సాగిన రెవెన్యూ సదస్సు

ఎంఆర్ఓఎస్ ఎల్వి ప్రసాద్

విశాలాంధ్ర-కొయ్యూరు : మండలంలోని రేవళ్ళ గ్రామ సచివాలయంలో బుధవారం కొయ్యూరు తహసిల్దార్ ఎస్.ఎల్.వి. ప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతుల నుండి వచ్చిన 70 వినతి పత్రాలను అధికారులు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ రైతుల నుండి వచ్చిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి గాను, సాధ్యా, అసాధ్యాలను అన్వేషించనున్నట్లు ఆయన తెలిపారు. సాధారణ వినతులను సుమారు 45 రోజులలో పరిష్కారమయేటట్టు చర్యలు తీసుకుంటామన్నరు. ఈ కార్య క్రమంలో ముఖ్య అతిథిగా ఎంపీపీ బడుగు రమేష్ పాల్గొన్నారు. డిప్యూటీ తాసిల్దార్ కుమారస్వామి, రీ సర్వే డిటిపి అప్పన్న, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్న దొర, మండల సర్వేర్, వీఆర్వో, వి.ఎస్.రెవెన్యూ టీం, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మి గణపతి హోమం

విశాలాంధ్ర-దేవీపట్నం : సంకష్టహర చతుర్థి పర్వదినం సందర్భంగా స్థానిక తంటికొండ రోడ్ లోని సీఎండీ కార్యాలయం వద్ద లక్ష్మి గణపతి హెూమాన్ని విశ్వహిందూ ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు, శ్రీమతి పద్మావతి దేవి గంగారత్నం దంపతులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రజలందరూ ఎల్లప్పుడూ సుఖ, సంతోషాలతో జీవించాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ఏటా పాడి పంటలు బాగా పండాలని, అన్నదాతలు, వ్యాపారస్తులు, కార్మికులు, కర్షకులు, అన్ని రంగాల వారు, ఆయురారోగ్యాలతో ఉండాలనే సంకల్పంతో గత కొన్ని నెలల నుంచి ప్రతి నెల లోక కళ్యాణార్థం లక్ష్మి గణపతి హెూమం ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు, సమాజ అభివృద్ధి తన సేవా కార్యక్రమలకు ఎటువంటి అవధులు లేకుండా కొనసాగిస్తూనే ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో దాసరి తమన్నా దొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, ఇనకోటి బాపన్న దొర, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, డాక్టర్ వల్లూరి జగన్నాధరావు శర్మ, కట్టా కళ్యాణ్,రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, బీజేపీ మండల అధ్యక్షులు సత్తి వెంకట రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదివాసీ స్వయంపాలన చైతన్య సదస్సును విజయవంతం చేద్దాం

విశాలాంధ్ర-జిమాడుగుల : భారతరాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ ననుసరించి సంక్రమించిన ఆదివాసీ భూచట్టాలు, అమలు చేయాలనీ, పీఈఎస్ఏ చట్టం ప్రకారం గ్రామ పంచాయితీ సంపదలో సర్వాధికారాలు పంచాయితీలకే ఉండాలని రేపు 20 వ తేదీన మండల కేంద్రం వేదికగా జి.మాడుగుల మండల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు నిర్వహించే ఆదివాసీ స్వయంపాలన చైతన్య సదస్సును అన్ని వర్గాల గిరిజన, గిరిజ నేతర ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు విజయవంతం చేద్దామని డి.ఎల్.ఓ జిల్లా అధ్యక్షులు కొండపల్లి కాంతరావు అన్నారు. స్వయంపాలన అధికార గొప్పతనం గురించి ప్రతి ఆదివాసీ బిడ్డ తెలుసుకోవలసిన అవసరం ఉందని, ఈ నినాదం గ్రామస్థాయిలో చైతన్యం చెయ్యాల్సిన అవసరం ఉందని ఇంత గొప్ప కార్యక్రమ బాధ్యత జి. మాడుగుల మండల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తీసుకోవడం గొప్ప పరిణామమని కొండపల్లి కాంతరావు అన్నారు. కనుక శుక్రవారం జరిగే ఈ కార్యక్రమాన్ని అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చెయ్యాలి కోరుతూ స్వయంపాలన అధికారం కోసం చేసే పోరాటాలకు డి. ఎల్. ఓ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

ముక్కునూరు సబ్ సెంటర్‌లో శిశు పరీక్ష, శీతాకాల ఆరోగ్య అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-చింతూరు : అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలోని ముకునూర్ సబ్ సెంటర్‌లో తులసిపాక పిహెచ్‌సి వైద్యులు ఉదయ్ కుమార్‌రెడ్డి చలికాలంలో పిల్లల ఆరోగ్యాన్ని కాపాడే చర్యల్లో ముక్కునూరు గ్రామం లో బుధవారం చైల్డ్ చెకప్, శీతాకాలపు ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం తల్లులు మరియు కుటుంబాలలో అవసరమైన శీతాకాల సంరక్షణ పద్ధతుల గురించి అవగాహన పెంపొందించడంపై దృష్టి సారించింది, సరైన తల్లిపాలను అందించే పద్ధతులు, శిశువులకు వెచ్చదనాన్ని నిర్వహించడం, చిన్న పిల్లలలో న్యుమోనియా వంటి సాధారణ శీతాకాల వ్యాధులను నివారించే చర్యలు ఉన్నాయి. ఈ చొరవలో ప్రసవానంతర తల్లులు, వారి అత్తమామలు, ఇతర కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఆరోగ్య విద్య సెషన్‌లు ఉన్నాయి. విజువల్ చార్ట్‌లు, ఆచరణాత్మక ప్రదర్శనలను ఉపయోగించి, ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు తల్లిపాలను అందించే పద్ధతులు మరియు శీతాకాల రక్షణ కోసం స్వాడ్లింగ్ వంటి ముఖ్యమైన పిల్లల సంరక్షణ పద్ధతులను వివరించారు. ఈ పద్ధతులను బాగా అర్థం చేసుకోవడానికి, అవలంబించడానికి స్థానిక భాషలో హ్యాండ్-ఆన్ వర్క్‌షాప్‌లు నిర్వహించబడ్డాయి. ఈసందర్భంగా ముక్కునూరు ఆరోగ్య, ఆరోగ్య కేంద్రంలోని చుట్టుపక్కల గ్రామాలు, హాట్‌స్పాట్ ప్రాంతాలకు చెందిన నవజాత శిశువులతో సహా 21 మంది శిశువులను పరీక్షించారు. నవజాత శిశువులపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో, హెచ్, విలు ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గిరి రైతులకు ఐతే అతివృష్టి... లేకుంటే అనావృష్టి.

పంట వేసే సమయంలో నీటి కొరత... పంట నూర్చే సమయాలలో అల్పపీడనాల బెడద

వరి నూర్పిడి, గాలిపోతలలో బిజీబిజీగా ఉన్న ట్రైకార్ మాజీ డైరెక్టర్ లోవరాజు, గిరి రైతులు

విశాలాంధ్ర-చింతపల్లి : అల్పపీడన ప్రభావం కారణంగా వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న మార్పులతో గిరి రైతులు వరి నూర్పిడి పనులు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ట్రైకార్ మాజీ డైరెక్టర్ సుర్ల లోవరాజు ఆధ్వర్యంలో వరి గాలి పోత పనులు త్వరితగతిన జరుగు తున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్య ప్రాంతంలో వర్షాధారంపై ఆధారపడిన గిరి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అయితే అతివృష్టి లేకుంటే అనావృష్టి అన్నచందంగా పంట వేసేటప్పుడు వర్షాలు లేక నీటి ఎద్దడితోనూ, పంటలు చేతికి వచ్చే సమయంలో అల్పపీడన ప్రభావాలతో కురిసే అకాల వర్షాల కారణంగా పంటలు తడిసి పాడయ్యే ప్రమాదం ఉన్నందున వరి పంట కోతలు కోసిన రైతులంతా వరిపనలు ఆరకముందే కుప్పలు వేసుకోవడం, ఆ అవకాశం కూడా లేని రైతులంతా వెనువెంటనే నూర్చుకోవడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది వరి పంట ఆశాజనకంగా ఉన్నప్పటికీ అల్పపీడన ప్రభావాలతో పండిన పంటకు నష్టం వాటిల్లే ప్రమాదం లేకపోలేదని, కనుకనే గాలి అనుకూలంగా లేకపోయినప్పటికీ గత్యంతరం లేక వరి నూర్చి శీతల గాలులతోనే గాలి పోత పనులు నిర్వహిస్తున్నామన్నారు.

స్థానికంగానే అర్జీలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-పార్వతీపురం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పి.జి.ఆర్.ఎస్) అందిన అర్జీలు స్థానికంగానే పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలు, గృహ నిర్మాణాలు, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం మండల స్థాయిలో పి.జి.ఆర్.ఎస్ విధిగా నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో పక్కాగా నిర్వహించాలని, సమస్యలు అచ్చటనే పరిష్కారం కావాలని ఆయన ఆదేశించారు. ప్రజల నుండి వస్తున్న అర్జీలను అశ్రద్ధ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజా పంపిణీ క్రింద వస్తున్న సరుకులు కూడా సక్రమంగా పంపిణీ చేయని డీలర్లపై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అక్రమాలకు పాల్పడిన డీలర్లను తొలగించాలని ఆయన ఆదేశించారు. గృహ నిర్మాణంలో పనితీరు ఆధారంగా అధికారులకు గ్రేడ్ లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.అర్హులైన యువతను, ఓటర్లను నమోదు చేయాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోభిక ధాన్యం కొనుగోలు, చెల్లింపులు వివరాలు గూర్చి తెలిపారు. ఈసమావేశంలో డి.ఆర్.డి.ఏ ప్రాజెక్టు డైరెక్టర్ వై సత్యం నాయుడు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామ చంద్ర రావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి వి.ఎస్.నగేష్ బాబు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్ మన్మథ రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్భ కొండలరావు, జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ తిరుపతి నాయుడు, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా సర్వే సెటిల్మెంట్ అధికారి పి లక్ష్మణ రావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీనివాస రావు, జిల్లా గిరిజన సంక్షేమ, సాధికారత అధికారి ఎం.డి.గయాజుద్దీన్, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, ఆర్ అండ్ బి ఇంజనీరింగ్ అధికారి సుబ్బారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారి ఏ మణి రాజ్, డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డా. టి.జగన్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను ఉప విద్యాశాఖ అధికారి పరిశీలిన

విశాలాంధ్ర-సీతంపేట : ఐటీడీఏ పరిధిలో గల జీపిఎస్ పాఠశాల సవర గోయిది ని సందర్శించడమైనది. విద్యార్థుల విద్యా స్థాయిని పరిశీలించిన తర్వాత ఈ క్రింది విషయాలు ఉపాధ్యాయుని కి సూచించడమైనది. తరగతికి తగిన విధంగా పిల్లల్లో విద్యా స్థాయిని పెంచాలి, ఒకటి రెండు తరగతులకు సంబంధించి అక్షరమాల బోర్డులు తరగతి గదిలో ప్రదర్శించాలి, ప్రతిరోజు ఒకటి రెండు తరగతులకు అక్షరమాల మౌఖికంగా డ్రిల్లింగ్ చేయించాలి, మూడు నాలుగు ఐదు తరగతులకు చతుర్విధ ప్రక్రియలు పై ఎక్కువ ప్రాక్టీస్ చేయించాలి అని ఉపాధ్యాయులకు సూచించారు.

బీవీకే పాఠశాలలో ఘనంగా పిక్నిక్ కార్యక్రమం

విశాలాంధ్ర-జి మాడుగుల : మండలంలో గల స్థానిక బీవీకే పాఠశాలల్లో పిక్నిక్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా బీవీకే పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, డాన్సులతో అలరించారు ఆనందంగా గడిపారు, అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో బివికే ప్రిన్సిపాల్, సూర్య ప్రకాష్, టీచర్స్ పాల్గొన్నారు.

కన్నుల పండుగగా అటకేశ్వరస్వామి వారి వార్షికోత్సవం

విశాలాంధ్ర-మోతుగూడెం : మోతుగూడెం సచివాలయం పరిధిలో గల పొల్లూరు పవర్ హౌస్ కొండపై అవతరించినటువంటి శ్రీశ్రీ శ్రీ అటకేశ్వర స్వామి వారి రెండవ వార్షికోత్సవం ఆలయ కమిటీ వారు కన్నుల పండగ నిర్వహించారు. అర్చకులు కుమార్ స్వామి శర్మ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామునుంచి స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, పంచామృతాభి షేకాలు, బిళ్వార్చన, రుద్ర హెూమము, మరియు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ వారు భక్తులు కొండపైన స్వామివారిని దర్శించు కోవడానికి వాహన సదుపాయం కల్పించారు. అనంతరం మధ్యాన్నం 12 గంటల నుండి అన్న సమారాధన నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమం పొల్లూరు వాస్తవ్యులు చావ్వకుల రాజశేఖర్, వెంకటలక్ష్మి దంపతులు ఏర్పాటు చేసారు. పొల్లూరు, మోతుగూడెం, మరియు చుట్టుపక్కల గ్రామాల ప్రజల అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏడుగురాళ్లపల్లి గ్రామపంచాయతీలో రెవెన్యూ సదస్సులు

విశాలాంధ్ర-చింతూరు : ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీకి చెందిన కాటుకపల్లి , ఏడుగురాళ్లపల్లి , మద్దిగూడెం గ్రామములలో బుధవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ గ్రామ సభకు రెవిన్యూ సదస్సుల స్పెషల్ ఆఫీషర్ శ్రీమతి కె.సుజాత, తహసీల్దార్ యస్. చిరంజీవి బాబు, ఆర్.ఐ విగ్నేష్ మండల సర్వేయర్ గోవిందరాజు, గ్రామ రెవిన్యూ అధికారి సిహెచ్ మోహన్, గ్రామ సర్వేయర్లు, మెడికల్ డిపార్ట్మెంట్ కిషోర్‌కుమార్ ఒప్తలమిక్ ఆఫీసర్, ఏఎన్ఎంలు లక్ష్మి, స్వరూపారాణీ సిబ్బంది గ్రామసభలకు హాజరయ్యారు. ఇందులో భూమి సంబంధిత సమస్యల అనగా, ఆన్లైన్ నమోదు కొరకు, పట్టా మార్పుల కొరకు, అసైన్ మెంట్ పట్టాలు కొరకు, భూమి సర్వే కొరకు, విస్తీర్ణం తప్పులు, కొత్తగా పాస్ పుస్తకం కొరకు ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కొరకు దరఖాస్తులు స్వీకరించారు, రెవిన్యూ దరఖాస్తులు 63 వచ్చాయి. మెడికల్ సంబంధించి 41 మంది చెకప్ చేయించుకున్నారు.

అంగన్వాడీలో పిల్లలకు పోషకాహారం అందించాలి

సిడిపిఓ జి సుగుణకుమారి

విశాలాంధ్ర-కొమరాడ : అంగన్వాడీలో చదువుతున్న పిల్లలందరికీ పోషకాహారం అందించాలంటూ ప్రాజెక్టు సిడిపిఓ బుధవారం కోటిపాంలో అంగన్వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా సిడిపిఓ జి సుగుణ కుమారి పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మన్యం కలెక్టర్ ఏ.శ్యాంప్రసాద్ శిశు సంక్షేమ శాఖ పీడిఎంఎస్ రాణి ఆదేశాల ప్రకారం పరిశీలించారు. ముందుగా పలు రికార్డులు వంటగది అంగన్వాడి కేంద్రం చుట్టుపక్క పరిసరాలు ఆమె పరిశీలించారు. చిన్నారుల కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో వేల కోట్లు ఖర్చుపెడుతుందని అంగన్వాడీలో ప్రతిరోజు పిల్లలకు గర్భిణీలకు గుడ్లు పాలు అందించాలంటూ మెనూ ప్రకారంగా పిల్లలందరూ అంగన్వాడి కేంద్రంలోనే భోజనం పెట్టి ఇంటికి పంపించాలన్న అంగన్వాడీ కేంద్రాలు రెండు పూటలు పనిచేయాలని లేదంటే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

కేన్సర్ వ్యాధితో వ్యక్తి మృతి

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని రాజుపేట పంచాయతీ రాజుపేట కాలనీ గ్రామానికి చెందిన ముత్యాల రాంబాబు (36) గత ఆరు నెలలుగా కేన్సర్ వ్యాధితో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న రాంబాబుకు వ్యాధి తగ్గడం కోసం ఆయన కుటుంబీకులు చాలా ఆర్థికంగా ఇబ్బందులు పడ్డారని, నిరుపేద కుటుంబమని, ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో దాతలు ముందుకు రావాలని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. మృతుడు కి తల్లి శ్యామల, భార్య, ముగ్గురు అక్కలు, ఒక తమ్ముడు ఉన్నారు. ఈ ఇంట్లో ఆయన తమ్ముడు అంద వికలాంగుడు తమ్ముడు భార్య వికలాంగురాలు, నిరుపేద కుటుంభాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు కోరుతున్నారు.

గుర్తేడులో రెవిన్యూ సదస్సులు

విశాలాంధ్ర-వై.రామవరం : మండల ఎగువ ప్రాంతమైన గుర్తే దు గ్రామం లో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ కె. సుధాకర్ రావు ఆధ్వర్యంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులు ల్లో గిరిజనులు పలు భూ సమస్యలు విన్నవించారు. మండల టీడీపీ అధ్యక్షుడు పల్లా ల వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ శాశ్వత భూ హక్కు పత్రాలు పొందేందుకు రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందని, గతప్రభుత్వం లాండ్ టైట్లింగ్ చట్టం పేరుతో అవకతవకలకు పాల్పడిందని కూటమి ప్రభుత్వం దానిని ప్రక్షాళన చేస్తుందన్నారు.కార్యక్రమం లో సర్పంచ్ గొర్లె దుష్యంతుడు పాల్గొన్నారు.

సుస్థిరాభివృద్ధిపై శిక్షణ కార్యక్రమాలు

విశాలాంధ్ర-బలిజిపేట : గ్రామాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించాలని ఎంపీడీఓ విజయలక్ష్మి అన్నారు బుధవారం నాడు స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సమావేశంను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో సుస్థిర అభివృద్ధి కోసం రెండు రోజులు సచివాలయ సిబ్బందికి, గ్రామ పంచాయతీ సర్పంచులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సుస్థిర అభివృద్ధి కోసం తొమ్మిది లక్ష్యాలను వివరించారు. పేదరికము లేని గ్రామం రెండు ఆరోగ్యకరమైన గ్రామం బాలల స్నేహపూర్వక గ్రామం సమృద్ధిగా నీరు ఉండే గ్రామం పరిశుభ్ర గ్రామం సంపూర్ణ మౌలిక సదుపాయములు సామాజిక న్యాయం సుపరిపాలన మహిళలు స్నేహపూర్ గ్రామం ఈ అంశాలను ప్రతి గ్రామము సంపూర్ణంగా అమలు చేసినప్పుడు గ్రామము అభివృద్ధి చెందుతుందని, గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడు దేశ అభివృద్ధి జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు అలజింగి రవికుమార్, ఈవోపీఆర్డి కె పుష్పారావు, ఏవో నగేష్, డిపి ఆర్పి డిఆర్ వెంకట రమణ సచివాలయ సిబ్బంది గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

హమాలీలు, యూనియన్ నాయకుల మధ్య కుదిరిన పిసిరేటు ఒప్పందం

విశాలాంధ్ర-బలిజిపేట : మండలంలో రైస్ మిల్లు అసోసియేషన్ వారికి రైస్ మిల్ హమాలీలు వారికి ప్రతి రెండు సంవత్సరాలకి ఒక్కసారి పీసి రేటు ఒప్పందం జరుగుతుంది. ఈఏడాది డిసెంబర్ 10కి అగ్రిమెంటు ముగిసిన విదప మరల కొత్తగా వేతన ఒప్పందం జరుపుకోవలసి ఉన్న నేపథ్యంలో పలుదపాలుగా చర్చలు జరిగిన సందర్భముగా ఈరోజు యజమానులకు యూనియన్ మధ్య మధ్య 12శాతం పిపిరేటు పెంచుటకు అంగీకారం కుదిరింది. రైస్ మిల్లు కార్మికులకు ప్రభుత్వం భద్రత చట్టం పిఎఫ్ పెన్షన్ సౌకర్యం ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైస్ మిల్లు అసోసియేషన్ నాయకులు కొత్తకోట రమేష్, సాయిరాం, రఘుశేఖర్ యూనియన్ అధ్యక్షులు అప్పారావు గేదెల సత్యనారాయణ, యమ్మల మన్మధరావు ,సురేంద్ర, సింహాచలం తదితర రైస్ మిల్ కార్మికులు పాల్గొన్నారు.

ఉచితంగా కట్టెల పొయ్యిలు పంపిణీ

విశాలాంధ్ర-సీలేరు : జీకేవీధి మండలం దారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, గాలికొండ అమ్మవారి దారకొండ పంచాయితీలలో 5000 కట్టెల పొయ్యిలను గిరిజనులకు పంపిణీ చేసినట్టు లండన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవెట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నట్టు సాగిన రమేష్ పడాలి వర్మ తెలిపారు. కట్టెల పొయ్యిలను ఉచితంగా పొందడానికి ఆధార్ కార్డ్ రేషన్ కార్డ్ అలాగే కుల ధ్రువీకరణ పత్రం ఉండాలన్నారు.గత నాలుగు సంవత్సరాలుగా ఉచిత కట్టెల పొయ్యిలని పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాగిన ఇంద్రవతి, శెట్టి గణపతి పాల్గొన్నారు.

20 న వెంటివ్ హాస్పిటాలిటీ పబ్లిక్ ఆఫర్

విశాలాంధ్ర-పాడేరు : వెంటివ్ హాస్పిటాలిటీ లిమిటెడ్ (గతంలో ఐసీసీ రియాల్టీ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్గా పిలువబడేది) ఈక్విటీ షేర్ల ప్రారంభ పబ్లిక్ ఆఫర్‌కు సంబంధించి తన బిడ్/ఆఫర్‌ను డిసెంబర్ 20, శుక్రవారం నాడు తెరుస్తుంది. 2024. యాంకర్ ఇన్వెస్టర్ బిడ్డింగ్ తేదీ అనేది బిడ్/ఆఫర్ ప్రారంభ తేదీకి ఒక పని దినం, ఇది గురువారం డిసెంబర్ 19 బిడ్/ఆఫర్ న ముగుస్తుంది. ఈక్విటీ షేర్ల మొత్తం ఆఫర్ పరిమాణం (ఒక్కొక్కటి ముఖ విలువ రూ. 1) రూ. 16,000 మిలియన్ రూ. వరకు సముదాయానికి సంబంధించిన తాజా సమస్యను కలిగి ఉంది 16,000 మిలియన్లు ("మొత్తం ఆఫర్ పరిమాణం"). ఇష్యూ ప్రైస్ బ్యాండ్ రూ. 610 నుండి రూ. ఈక్విటీ షేర్‌కి 643. ("ది ప్రైస్ బ్యాండ్"). రూ. తగ్గింపు ఎంప్లాయి రిజర్వేషన్ పోర్షన్ ("ఉద్యోగుల రిజర్వేషన్ పోర్షన్ డిస్కౌంట్")లో వేలం వేయడానికి అర్హులైన ఉద్యోగులకు ఈక్విటీ షేర్‌కు 30 అందించబడుతోంది. కనిష్టంగా 23 ఈక్విటీ షేర్ల కోసం మరియు ఆ తర్వాత 23 ఈక్విటీ షేర్ల గుణిజాలలో బిడ్లు వేయవచ్చు.

ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్‌కు భవాని భక్తుల సన్మానం

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్

విశాలాంధ్ర-వి.ఆర్.పురం : అల్లూరి సీతారామరాజు జిల్లా మండలంలోని వడ్డిగూడెం గ్రామంలో భవాని మాల ధారణ భక్తులు బుధవారం ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకె సిటీ ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ ముఖ్యఅతిథిగా ఆహ్వానించి పూల మాలలు వేసి సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు.ఇదే సందర్భంగా జమాల్ ఖాన్ నూతన వధూవరులైన బొడ్డు రవికుమార్ పూజిత నవ దంపతులను ఆశీర్వదించి 5000 రూపాయలను కానుకగా అందజేశారు. వికలాంగుల సంఘం అధ్యక్షులు పెట్ట హరిబాబు శాలువా కప్పి ఆయనను సన్మానించినారు. ఈ సందర్భంగా ఒడ్డుగూడెం గ్రామ పెద్దలు ముత్యాల రామారావు మాట్లాడుతూ భవాని భక్తుల ఆహ్వానం మేరకు జమాల్ ఖాన్ తమ గ్రామానికి వచ్చి భక్తులను కలిసి చిరు కానుకను స్వీకరించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం జమాల్ ఖాన్ మాట్లాడుతూ అందరి దైవం ఒకటేనని అందరూ కలిసిమెలిసి సోదర భావంతో మెలగాలని కులమతాలు వేరైనా అందరి లో ఆ దైవం దాగి ఉందన్నారు. మతసామరస్యంతో మనుషులు కలిసినప్పుడే సుఖ సంతోషాలు వెల్లువిరుస్తాయన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మత్తు పదార్థాలు విడనాడిమంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలన్నారు. మాలాధారణ సమయంలో ఎంత నిష్టతో ఉన్నారో మాల తీసిన అదే నిష్టతో మంచి క్రమశిక్షణతో ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, సయ్యద్ సర్ఫరాజ్, ముత్యాల శంకర్, మల్లికార్జునరావు, సవలం రాజు, ముత్యాల శ్రీరామ్, భవాని భక్తుల గురుస్వామి ముత్యాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బడిదేవరకొండ మైనింగ్ పనులు ఆపాలి...

బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ పిలుపు

విశాలాంధ్ర-బెలగాం : అక్రమంగా పనులు చేపడుతున్న బడిదేవరకొండ మైనింగ్ తవ్వకాలను వెంటనే ఆపాలని బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. కృష్ణమూర్తి మాట్లాడుతూ బడిదేవరకొండ తవ్వకాలు ప్రభుత్వ, ప్రజాప్రతినిధుల ప్రమేయంతోటే పనులు చేపడుతున్నారని, ఈ పనుల వల్ల కొండకు ఆనుకొని ఉన్న గిరిజనులకు, ప్రజలకు పార్వతీపురం మండలానికి తీవ్ర నష్టానికి గురిచేస్తుందని తెలిపారు. ఈ అక్రమ మైనింగ్ ఆపాలని గత నెల నవంబర్ 6న బడిదేవరకొండ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పాదయాత్ర ప్రారంభించినప్పుడు ఎమ్మెల్సీ కోడ్ కారణంగా అనుమతులు లేవని పోలీసులు అడ్డుకోవడంతో కార్యక్రమం నిలిపివేయడం జరిగిందని, దాని అనంతరం రైతులకు, ప్రజలకు ముమ్మరంగా కోతలు సీజన్ గా ఉండడంతో కమిటీ నిర్ణయం మేరకు తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆనాడే కమిటీ ప్రకటన ద్వారా తెలియజేసిందన్నారు. నేడు కోతలు పూర్తి కావడంతో కార్యక్రమం పునఃప్రారంభం కొరకు కమిటీ నిర్ణయంతో ఈనెల 28వ తేదీ ఉదయం10 గం.లకు కోరి గ్రామంలో కొండ గ్రామాలతో పాటు చుట్టు ప్రక్కల ఉన్న అన్ని గ్రామ ప్రజలతో విస్తృతస్థాయి సమావేశం నిర్వహించడం జరుగుతుందని, ఈ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కావున ప్రజలందరూ తప్పక పాల్గొని జయప్రదం చేయాలని, అక్రమ మైనింగ్ పనులను అడ్డుకునేందుకు ముందుకు రావాలని పరిరక్షణ కమిటీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పాలక రంజిత్ కుమార్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బంటు దాసు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింగరావు, సిపిఐ నాయకులు ఆర్వీఎస్ కుమార్, చెరువుల పరిరక్షణ కమిటీ నాయకులు వి. దాలినాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నాయకులు పి. శ్రీనునాయుడు, ఎం. భాస్కరరావు, జనసేన నాయకులు పిన్నింటి జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చలికి గజగజా వణుకుతున్న మన్యం

- ఒక్కసారిగా పడిపోయిన రాత్రి ఉష్ణోగ్రతలు
- సాయంత్రమైతే బయటకు వచ్చేందుకు బయపడుతున్న ఏజెన్సీ ప్రాంతవాసులు
- రోగాలు బారిన గిరిజనులు... జాగ్రత్తలు తప్పనిసరంటున్న వైద్యులు

విశాలాంధ్ర-కురుపాం : మన్యంలోని కురుపాం నియోజకవర్గంలో రాత్రి ఉష్ణోగ్రతలు ఒక్క సారి గా తగ్గి పోవడంతో ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలంతా చలికి గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం ఆరు నుంచి ఉదయం ఎనిమిది లోపు బయటకు వెళ్ళేందుకు బయపడాల్సిన పరిస్థితి. అంతేకాకుండా అత్యధిక శాతం మంది జలుబు, చలిజ్వరాలు, దగ్గు, బారిన పడుతున్నారు. గతంలో మునుపెన్నడూ లేనంతగా రాత్రి ఉష్ణోగ్రతలు 9డిగ్రీలు, 10డిగ్రీ లకు పడి పోవడంతో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. గిరిజన ప్రాంతాల్లో ఏగ్రామాన్ని తొంగి చూసిన చలి మంటలు, అగ్గి కుంపట్లు దర్శనమిస్తున్నాయి. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు సరైన సౌకర్యాలు లేకపోవడంతో చలికి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల వింత రుగ్మతలు (తీవ్ర ఒళ్లు నొప్పులు, జ్వరాలు, దగ్గు ,కఫం)ఎదుర్కొంటున్న గిరిజన గ్రామాల్లో ప్రజలకు ఒక్కసారిగా పెరుగుతున్న చలి మరింత అనారోగ్యం బారిన పడవేస్తుంది.చలి నుంచి రక్షణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ముందు జాగ్రత్తలతో ఆరోగ్యం కాపాడుకోవాలి : డాక్టర్:శోభారాణి, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, కురుపాం

ఏజెన్సీ ప్రాంతంలో ఒక్కసారిగా పెరుగుతున్న చలి తీవ్రత నుంచి ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శోభారాణి సూచించారు. బహిరంగ ప్రదేశాలకు వెళ్లి నపుడు స్వెట్టర్లు ,మంకీ క్యాప్, గ్లౌజ్‌లు ధరించాలని, ఇళ్ళలో రగ్గులు కప్పుకొని నిద్రించాలని అన్నారు. వేడి నీరు, వేడి వేడి పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై నిర్లక్ష్యం చూపకుండా ఒక్క రోజు దాటిన ఎలాంటి రుగ్మతలైనా సమీపంలో ఆరోగ్య కేంద్రంకి వెళ్లి అవసరమైన వైద్య సేవలు తీసుకోవాలని కోరారు.

పర్యాటక రంగంలో స్థానిక గిరిజన యువకులకే శత శాతం అవకాశాలు కల్పించండి

గిరిజన సంక్షేమ శాఖ సంచాలకురాలు సదా భార్గవిని కోరిన తెదేపా పాడేరు ఇన్చార్జి ఈశ్వరి

విశాలాంధ్ర-చింతపల్లి : మన్యంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పర్యాటక రంగంలో స్థానికులకు శత శాతం అవకాశాలు కల్పించేందుకు కృషి చేయాలని పాడేరు మాజీ శాసన సభ్యురాలు, తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్ గిడ్డి ఈశ్వరి అన్నారు. బుధవారం లంబసింగి, తాజంగి గ్రామాల సమీపంలో నిర్మితమవుతున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం పనులను పరిశీలించేందుకు వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ సంచాలకురాలు సదా భార్గవిని మ్యూజియం వద్ద ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మన్య ప్రాంతంలో నెలకొన్న జలజీవన్ మిషన్ త్రాగునీటి పనులపై, నీటి సమస్యపై ఆమెకు వివరించారు. అదే క్రమంలో మన్య ప్రాంతంలోని పర్యాటక రంగం అభివృద్ధిపై ఆమెతో మాట్లాడారు. మన్య ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న పర్యాటక రంగంలో స్థానిక గిరిజనులకు శత శాతం అవకాశాలు కల్పించాలని, అదే క్రమంలో ఈ ప్రాంత సంస్కృతి, సాంప్రదాయాలు పెంపొందేలా పర్యాటక రంగం అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆమెను కోరారు. దీనిపై స్పందించిన ఆమె వాటిపై పూర్తి వివరాలు తనకు అందజేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆమెతోపాటు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి బొర్ర నాగరాజు, మండల నాయకులు లక్ష్మణ్, కేశవ్, పురుషోత్తం, రాము, రమణ, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

గిఫ్ట్ డీడ్ ద్వారా సాగు భూమిని బహుమతిగా ఇవ్వొచ్చు : తహసిల్దార్ టి.రామకృష్ణ

విశాలాంధ్ర-జి.కె.వీధి : మండలంలోని పట్టాదారులకు ఉన్న భూమిలో కొంత భూమిని తమ పిల్లలకు కుటుంబ సభ్యులకు ఇవ్వాలనుకుంటే గిఫ్ట్ డిడ్ (బహుమాన ఒప్పంద పత్రం) పద్ధతి ద్వారా ఇవ్వవచ్చని తహసిల్దార్ టి రామకృష్ణ అన్నారు.బుధవారం మండలంలో దామనపల్లి పంచాయతీ గ్రామ సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టాదారులు తమకున్న భూమిలో కొంత భూమిని వారసులకు గాని కుటుంబ సభ్యులకు గానీ రాసి ఇవ్వాలనుకుంటే గిఫ్ట్ డీడ్ పద్ధతి ద్వారా సాగు భూములను బహుమతిగా ఇచ్చుకునే అవకాశం ఉన్నదని తెలిపారు.రెవెన్యూ సదస్సులో భూ సమస్యలపై రైతులకు ఉన్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. రెవెన్యూ గ్రామాలలో ఎక్కువగా మ్యూటేషన్, వెబ్లాండ్ నమోదు వంటి సమస్యలు తమ దృష్టికి వస్తున్నాయని తెలిపారు.భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను పిజీఆర్ఎస్ పోర్టల్ లో

ఆన్లైన్ చేసి పరిష్కారం చేస్తున్నామన్నారు.దామనపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న రెవెన్యూ గ్రామాల పట్టాదారులు రెవెన్యూ సదస్సుకు వచ్చి భూ సమస్యలపై అర్జీలు అధికారులకు అందించారు. రైతుల ద్వారా తీసుకున్న అర్జీలను అక్కడికక్కడే ఆన్లైన్ చేసి పరిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్ ఐ మహదేవ్,సర్పంచ్ కుందరి రామకృష్ణ,మండల సర్వేయర్ శ్రీను పాల్గొన్నారు.

గ్రామాలలో సుస్థిర అభివృద్దే లక్ష్యంగా శిక్షణా తరగతులు ఉపయోగపడాలి

శిక్షణా తరగతులలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందికి సూచన

ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీపీ అనూష దేవి, జడ్పిటిసి బాలయ్య

విశాలాంధ్ర-చింతపల్లి : గిరి సుస్థిరమైన అభివృద్దే లక్ష్యంగా శిక్షణా తరగతులు ఉపయోగపడాలి అని స్థానిక ఎంపీపీ కోరాబు అనూష దేవి, జడ్పిటిసి సభ్యుడు పోతురాజు బాలయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజులపాటు నిర్వహించ తలపెట్టిన రెండవ విడత శిక్షణ తరగతులను ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల శిక్షణా తరగతులకు సంబంధించి ముగింపు రోజైన బుధవారం ముఖ్య అతిథులుగా విచ్చేసిన వారు మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో నిర్వహించిన శిక్షణ తరగతులను ఉద్దేశించి మాట్లాడుతూ గ్రామాలలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకై రిసోర్స్ పర్సన్స్ ఐసిడిఎస్ నుంచి సూపర్వైజర్ విజయ కుమారి, ఎం పి హెచ్ ఈ ఓ స్వామి లు ఇస్తున్న శిక్షణా తరగతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా శిక్షణా తరగతుల ముగింపును పురస్కరించుకుని ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు సచివాలయ, ఉద్యోగులు, సిబ్బంది తో వారు ప్రతిజ్ఞ చేయించారు.. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి : ఎంపీడీవో

విశాలాంధ్ర-గంగవరం : గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ప్రణాళిక లు రూపొందించాలని ఎంపీడీవో పీజీ రామకృష్ణ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర పాలన గ్రామాల అభివృద్ధి పై రెండు రోజుల శిక్షణ తరగతులు ముగింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ కృష్ణారెడ్డి ,జడ్పిటిసి బేబీ రత్నం తదితరులు మాట్లాడుతూ సామాజిక న్యాయం పేదరిక నిర్మూలన స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాల మహిళా స్నేహ పూర్వ క గ్రామాలు తదితర అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసరావు ,వైస్ ఎంపీపీ రామ తులసి ,ఉపాధి హామీ పథకం ఏపీవో ప్రకాష్, వెలుగు ఎపిఎం షణ్ముఖేశ్వరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

బిజెపి నాయకుడు శ్రీనివాసరావు

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మిపురంలోని బిజెపి నాయకుడు శ్రీనివాసరావు సన్నిహితులు ఆహ్వానం మేరకు పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మిపురం పర్యటనలో భాగంగా గిరిజన సంక్షేమ బాలుర జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ యుగంధర్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీనివాసరావు విచ్చేసి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు బానిసవకుండా జీవితం పాడు చేసుకోవద్దని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం సీఐలు తిరుపతిరావు, హరి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు, అమ్మాయిలపై అత్యాచారాలకు పాల్పడి అనవసరంగా జీవితం నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ శివ ప్రసాద్, రిటైర్డ్ హెడ్ మాస్టర్ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-జియ్యమ్మవలస : కేంద్ర పౌర విమానయాన శాఖామాత్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు జన్మదిన వేడుకలను మండలంలోని పెదబుడ్డిడి గ్రామంలో ఘనంగా జరిగాయి. ఆయన వీరాభిమాని కొండాపత్తులు కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ జన్మదిన వేడుకలకు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, మండల పరిషత్ అధ్యక్షులు బొంగు సురేష్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం దత్తి లక్ష్మణరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్ర బొబ్బిలి మన ప్రాంత ఆశాజ్యోతి అయిన కింజరాపు రామ్మోహన్ నాయుడు మాకందరికి గర్వించదగ్గ నాయకులని అయన కొనియాడారు. అనంతరం గ్రామంలో అన్నదాన కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మండల రమాకాంత్, బొత్స యాకోబు, రాగాల అప్పలకొండ, రేవల్ల సీతారాం నాయుడు, రేవల్ల రామమూర్తి నాయుడు (రాము మాష్టారు), బలిమి వెంకటరమణ, పంజరాపు దామోదర్ నాయుడు, తమ్మిరెడ్డి శ్రీనివాసరావు, కర్రి చిన్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు

ఆదివాసీ దీక్షా శిబిరానికి అటవీ శాఖ రేంజి అధికారి

గుర్తేడు రోడ్డు కోసం నాయకుల వినతి

విశాలాంధ్ర-వై.రామవరం : వై.రామవరం మండలం లోని అటవీప్రాంతంలో గుర్తే దు రోడ్డు నిర్మాణం కోసం ఆదివాసీ చైతన్య వేదిక సంక్షేమ సంఘం తలపెట్టిన రిలే నిరాహారదీక్షలు స్పందించిన అడ్డతీగల అటవీశాఖ రెంజీ అధికారి ఎస్.సాహెన్నా బుధవారం ఆదివాసీల దీక్షా శిబిరానికి వచ్చారు. రోడ్ల నిర్మాణాలకు ఫారెస్ట్ అధికారులే అడ్డు తగులుతున్నారని, రిజర్వ్ ఫారెస్ట్ సాకుతో గిరిజనుల అభివృద్ధిని నిర్వీర్యం చేస్తున్నారని ఆదివాసీ జిల్లా కార్యదర్శి మడిగొంట్ల వెంకటేశ్వర్లు దుయ్యబట్టారు. దీంతో రేంజి అధికారి స్పందిస్తూ తమ పరిదిలో ఉన్న గుర్తేడు రోడ్డు విషయమై గతంలోనే ప్రభుత్వానికి నివేదిక అందించామని, రోడ్డు పనులకు తమ సహకారం అందిస్తామని అన్నారు. లోతట్టు గ్రామాల్లో రహదారులకు చర్యలు తీసుకొనేవరకు తాము దీక్షలు అపబోమని అడివాసినాయకులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, పి.లక్ష్మణరావు, బత్తుల శారద, అటవీ శాఖ డిఆర్ఓ భాస్కరరావు, ఎఫ్ బి ఓ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరతను త్వరలో పరిష్కరిస్తాం : పీఓ

విశాలాంధ్ర-కూనవరం : మండలంలోని కాచవరం ఎంపీపీఎస్ స్కూల్‌ను ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు బుధవారం ఆకస్మికంగా సందర్శించి ఉపాధ్యాయుల కొరత గురించి పిల్లల తల్లిదండ్రులతో స్వయంగా మాట్లాడి తెలుసుకున్నారు. ఈ సమస్యను వీలు అయి అంత త్వరగా పరిష్కరించడం జరుగుతుంది అని పిల్లల తల్లి దండ్రులు ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం కూనవరం గ్రామ పంచాయతీకి సంబంధించిన పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు ముంపుకు గురిఅవుతున్న ఇళ్ల స్ట్రక్చరల్ వాల్యుయేషన్ స్వయంగా ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ చింతూరు వారు పరిశీలించారు. అదే విధంగా కూనవరం ప్రజలతో మాట్లాడుతూ ఇళ్ల సర్వే లో తేడాలు వచ్చిన ఇళ్ల ను మరల సర్వే చేయించడం జరుగుతుంది అని మరియు సర్వే కానీ వాళ్లకు త్వరలో ఇళ్ల సర్వే చేయించడం జరుగుతుంది అని అన్నారు. ఇళ్ల సర్వే తో పాటు చెట్లు మరియు ఇతర కట్టడాల యొక్క వాల్యుయేషన్ పని కూడా మొదలు పెట్టడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఏఎస్‌డిసి చింతూరు, రవితేజ డిఇ, పిఆర్, పంచాయతీ సెక్రటరీ పాల్గొన్నారు.తదుపరి కోతుల గుట్ట కేజీబీవీ స్కూల్ ను సందర్శించి స్కూల్ పరిసరాలను పరిశీలించారు.

ఉత్తమ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా తిరుపతిరావు

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : జిల్లా ఉత్తమ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా చినమేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ టివి తిరుపతిరావును ఎంపిక చేస్తూ డిజిపి ద్వారకా తిరుమల రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకు గాను డిజిపి తాలూకా కమాండేషన్ డిస్క్ 22 బ్రాంజ్ మెడల్ ను జిల్లా ఎస్పీ మాధవరెడ్డి చేతుల మీదుగా బుధవారం ఆయన అందుకున్నారు. అయితే 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో విజయనగరంలో రూరల్ ఎల్విన్ పేట సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆయన 10 కేసులలో ఇన్వెస్టిగేషన్ చేసి 6 కేసుల్లో శిక్ష పడేలా చేసినందుకుగాను ఈయనకు అవార్డుకు ఎంపిక చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా విలేకరులతో సిఐ టివి తిరుపతిరావు మాట్లాడుతూ ఈ బ్రాంజ్ మెడల్ నాకు దక్కడం ఎంతో సంతోషదాయకంగా ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా నా బాధ్యతను మరింత దృఢ సంకల్పంతో చేసేందుకు ప్రోత్సాహాన్ని ఇచ్చిందని ఆయన అన్నారు.

సుస్థిర అభివృద్ధి సాధనకు పటిష్ట చర్యలు : ఎంపీడీఓ

విశాలాంధ్ర-జీకే వీధి : మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయితీ సిబ్బంది ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి పంచాయితీ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై మూడవ బ్యాచ్‌తో శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించి పూర్తి చేశామని జీ.కే వీధి ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి శాఖ సూచనల మేరకు సర్పంచులు ఎంపీటీసీలు కార్యదర్శులు సచివాలయ సిబ్బంది మండల అధికారులు ఆధ్వర్యంలో అవగాహన శిక్షణ తరగతులు నిర్వహించమని తెలిపారు. మహిళా శిశు సంఖ్యాము విద్య వైద్యం తదితర రంగాల్లో సుస్థిర అభివృద్ధి సాధనకు చేపట్టవలసిన చర్యలు అనుసరించవలసిన విధానాలు తదితర అంశాలపై పంచాయతీ కార్యదర్శి అరుణ్ కుమార్ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో జీ.కే వీధి ఇఓపిఆర్‌డి వెలుగు ఏపీఎం సూర్యారావు పంచాయతీరాజ్ ఏఈ జ్యోతి బాబు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు ఐసిడిఎస్ సిడిపిఓ ఇమ్మానియేల్ వ్యవసాయ శాఖ అధికారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బాగుజోల గిరిజన గ్రామాన్ని కలెక్టర్, జిల్లా ఎస్పీలు సందర్శన



విశాలాంధ్ర-మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలోని పనసభద్ర పంచాయతీ పరిధిలోని బాగుజోల గిరిజన గ్రామాన్ని కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పి మాధవరెడ్డిలు బుధవారం సాయంత్రం జిల్లా యంత్రాంగంతో సందర్శించారు. సిరివర గ్రామానికి వెళ్లే రహదారిని పరిశీలించారు అనంతరం బాగుజాల, సిరివర, చిలకమెండంగి తదితర గిరిజన గ్రామాల ప్రజలతో మమేకమయ్యారు. బాగుజోల గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను అందరూ వినియోగించుకోవాలని సూచించారు. అలాగే గ్రామంలో అన్ని కుటుంబాలకు వెంటనే మరుగుదొడ్ల మంజూరు చేయమని ఎంపీడీవో డిడి స్వరూప రాణిని ఆదేశించారు. డిఆర్డిఏ పిడి సత్యం నాయుడుతో మాట్లాడుతూ గిరిజనులకు అవసరమైన వందన వికాస్ కేంద్రాలను, రాయితీపై గొర్రె పిల్లలకు రుణాలను అందించాలని ఆదేశించారు. చిలకమెండంగి, సిరివర గ్రామస్తులు రహదారులు సౌకర్యం కల్పించాలని కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. రహదారులు ఉంటే అనారోగ్యాలు పడిన ఆసుపత్రులు చేరేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్కు కోరారు. నిలువచేసిన మాంసాహారాన్ని తినకూడదన్నారు. సిగ్నల్స్ లేవని పాఠశాల భవనం దెబ్బతిందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే సమస్యకు పరిష్కారం చూపుతారని వారితో అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హేమలత, ఫారెస్ట్ రేంజర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కే గోపాల్‌రావునాయుడు, తహసిల్దార్ షేక్ ఇబ్రహీం, పోలీస్ సిబ్బంది వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటన ఇక్కడేనా..? రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ ఒకటి రెండు రోజులలో జిల్లాలో పర్యటనన్నట్లు తెలిసింది. మక్కువ మండలంలో గిరిశికర గ్రామాలను సందర్శించే అవకాశం ఉందని తెలిసింది. ఇందులో భాగంగానే బుధవారం జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, ఎస్పీ మాధవరెడ్డి బాగు జో ల సిరివర రహదారులను పరిశీలించారు. పర్యటన లో భద్రత విషయాలను పరిశీలించి సురక్షిత ప్రాంతాలను ఎంపిక చేసినట్లు తెలిసింది. అలాగే డిప్యూటీ సీఎం వచ్చి పోయేందుకు హెలి ప్యాడ్ లను ఎర్ర సామంతవలస, పార్వతీపురం మండలం వెంకంపేట పరిసరాలలో స్థలాలను పరిశీలించినట్లు కూడా తెలియ వచ్చింది. ఈనెల 20 లేదా 21 తేదీలలో డిప్యూటీ సీఎం పర్యటన ఉండబోతుందని అధికార వర్గాల బోగట్ట.